క్లుప్తంగా

ఆర్బీకే ఉద్యోగుల సంఘం సాయం



శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని ముచ్చింతాల గ్రామ రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గ్రామానికి చెందిన దైద శ్రీనివాసరావు మూడు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. సోమవారం శ్రీనివాసరావు భార్య క్రాంతి కుమారికి రాష్ట్ర రైతు భరోసా కేంద్రాల ఉద్యోగుల సంక్షేమ సంఘం తరుపున రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె. విజయ్‌మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రాంతి కుమారి ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా ప్రయత్నిస్తామని పిల్లల చదువుకు సంఘం తరుపున అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని మూడో వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులతో పాటు దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలను సోమవారం ఆయన పరిశీలించారు. వార్డులోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ ఖాలిక్ , పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం వినూత్న ర్యాలీ చేశారు. కలశం, మట్టి, మొక్కతో పాటు జాతీయ నాయకుల చిత్ర పటాలు, జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని స్వాతంత్య్ర సమర యోధుల పేర్లతో నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగతాయారు, సుజాత, వసంత, లక్ష్మణరావు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: కోలాట, కళాజాత బృందాలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం, సమాచార, ప్రచార మంత్రిత్వ శాఖ తరపున మూడేళ్ల పాటు కళాజాతల నిర్వహణ కోసం వ్యక్తిగతంగా, బృందాలుగా కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన కళాబృందాలు 10వ తేదీ లోగా వారి వివరాలను ప్రోగ్రాం కోఆర్డినేటర్ మీసాల బాబ్జి (ఘంటసాల), ఫోన్ నంబర్లు 75692 75628, 98498 76866లలో సంప్రదించాలని కోరారు.

నెమలి దేవస్థానం ఆదాయం రూ. 2.43 లక్షలు

నెమలి(గంపలగూడెం): నెమలి దేవస్థానంలో రెండు గదులకు అద్దె నిర్ధారించేందుకు నిర్వహించిన వేలం పాట ద్వారా ఏడాదికి రూ. 2,43,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ డి. శ్రీరామవర ప్రసాద రావు తెలిపారు. 3వ నంబర్ గదిని వంగల మల్లికార్జునరావు నెలకు అద్దె రూ. 3,700కు, 7వ నంబర్ గదిని బొల్లెపోగు చిన్న వెంకటేశ్వర్లు రూ. 16,600కు అత్యధికంగా పాడి కైవసం చేసుకున్నట్లు సహాయ కమిషనర్ పేర్కొన్నారు. రెండు గదుల మీద అద్దె రూపేణా ఆదాయం ఏడాదికి రూ. 2,43,600 వస్తుందని తెలిపారు. షేర్ మహమ్మద్ పేట గ్రూపు దేవాలయాల ఈఓ సీహెచ్ దుర్గా నాగేశ్వరరావు పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు.



ప్రాదేశిక పాలనకు రెండేళ్లు

- జగనన్న పాలనలో గ్రామాల్లో సంక్షేమం
- గర్వంగా భావిస్తున్న ప్రజా ప్రతినిధులు



సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రభుత్వవిప్ ఉదయభాను (ఫైల్)

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో రెండేళ్ల క్రితం మండల, జిల్లా పరిషత్‌లకు నూతన పాలకవర్గాలు ఏర్పడ్డాయి. రెండేళ్ల పాలనా అనుభవం తమను ప్రజలకు మరింత చేరువ చేసిందని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరిషత్ ఎన్నికలు జరిగిన తీరు...

పరిషత్ ఎన్నికలకు 2020లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటికీ కోవిడ్ ప్రభావంతో నోటిఫికేషన్‌ను 2020, మార్చి 15న రద్దు చేశారు. తిరిగి 2021 ఏప్రిల్ 8న ఎన్నికలు నిర్వహించారు. పెనుగంచిప్రోలు మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా లింగగూడెం, నవాబుపేట ఎంపీటీసీ స్థానాలు వైఎస్సార్ సీపీ ఏకగ్రీవం కాగా, కొణకంచి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి మృతి చెందడంతో అక్కడ ఎన్నిక నిలిచి పోయింది. మిగిలిన 12 స్థానాల్లో ఎన్నికలు జరగ్గా వైఎస్సార్ సీపీ 11 చోట్ల, టీడీపీ ఒక స్థానంలో విజయం సాధించింది. వత్సవాయి మండలంలో 18 స్థానాలకు వైఎస్సార్ సీపీ రెండు ఏకగ్రీవం కాగా, 16 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా వైఎస్సార్ సీపీ 13, టీడీపీ 3 స్థానాల్లో గెలుపొందింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయినప్పటికీ ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించటంతో కౌంటింగ్ ప్రక్రియ నిలిచి పోయింది. 2021, సెప్టెంబర్ 19న లెక్కింపు చేపట్టగా 24న సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రెండు మండలాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులే పాలనలో ఉన్నారు.

ప్రజలతో మమేకం..

ప్రస్తుత పరిషత్ పాలకవర్గాలు తమ రెండేళ్ల పాలనలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేస్తుండటంతో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా పింఛన్ పారదర్శకంగా పంపిణీ చేయటంతో పాటు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్‌క్లినిక్, నాడు–నేడు పథకంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణంతో ప్రజాప్రతినిధులు గర్వంగా జగనన్న పాలన గురించి చెబుతున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో..



స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. మండలాభివృద్ధికి సంబంధించి నిధులు అడిగిన వెంటనే అందిస్తూ అభివృద్ధిలో భాగస్వాములు చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.
–మార్కపూడి గాంధీ, ఎంపీపీ, పెనుగంచిప్రోలు

అందుతున్న సంక్షేమం..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ప్రతి నెలా సంక్షేమం అందుతోంది. ప్రతి నెలా మొదటి తారీఖు తలుపు తట్టి పింఛన్ ఇంటికి అందిస్తున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. –వూట్ల నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు, పెనుగంచిప్రోలు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా..



జగనన్న పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్నాయి. ఈరెండేళ్ల కాలంలో ప్రజలతో మమేకమై అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకున్నాం. అందరి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.
–ఏసుపోగు దేవమణి, జెడ్పీటీసీ, వత్సవాయి

కొనసాగుతున్న చవితి వేడుకలు

పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద ఎనిమిదవ రోజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించారు. పలు మండపాల్లో శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కొన్ని గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

భీమవరం(వత్సవాయి): ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతికి విశేషపూజలు అందుకుంటున్నాడు. గత ఆరేళ్లగా ఆర్యవైశ్య సంఘవారి ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ఏర్పాటుచేసి పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు రెండు పూటలా స్వామివార విశేషపూజాకార్యక్రమాలను దంపతులు పీటలపై కూర్చుని జరిపిస్తున్నారు.

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని పెద్దాపురం, జయంతి, జుజ్జూరులతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, ఆలయాలలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాలలో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారిని ఉంచి గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలిస్తున్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల : వినాయక చవితి సందర్భంగా స్థానిక మోడల్‌కాలనీ, పెట్రోలు బంక్ సెంటర్, వసంత కాలనీ, పోలీస్‌స్టేషన్ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పెట్రోలు బంక్ సెంటర్‌లో బాల వినాయకుడి ఉత్సవ కమిటీ అన్న సమారాధన చేశారు.



పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు

నందిగామ: పట్టణంలోని ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతి విగ్రహం వద్ద సోమవారం లోక శాంతిని కాంక్షిస్తూ సుదర్శన, నవగ్రహ, పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి మార్కెట్ లోని భారీ గణపతి విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. మెయిన్ బజార్, గాంధీ సెంటర్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన చవితి పందిళ్ళ వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో విశేష పూజలు నిర్వహించారు.

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలో సోమవారం ఎనిమిదవ రోజున పలు వార్డులలోని మండపాలలో కొలువై ఉన్న గణనాథుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, భజనలు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక చెరుకూరి వీధిలో అన్నదాన కార్యక్రమం గణేష్ యూత్ సభ్యులు రామిశెట్టి గోపి కృష్ణ, చెరుకూరి అజయ్, వేల్పుల సతీష్, వేణుగోపాల్, సైదులు మీరా ఆధ్వర్యంలో నిర్వహించారు. బలుసుపాడు రోడ్ మంగలి బజారులోని మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. స్థానిక మున్సిపల్ ఐకేపీ (మెప్మా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పూజలు నిర్వహించారు. ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరంలో పూజలందుకుంటున్న మట్టి వినాయకుడి విగ్రహం



చెరుకూరి బజారులో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం



ముక్కోటి మండపంలో నిర్వహిస్తున్న లోక శాంతి హోమాలు



బలుసుపాడు రోడ్డులో మండపం వద్ద కుంకుమార్చన చేస్తున్న భక్తులు



పేట ఐకేపీలో విగ్రహం వద్ద పూజల్లో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తదితరులు

పండిట్ దీన్ దయాళ్ జయంతి

జగ్గయ్యపేట అర్బన్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి పట్టణంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీతారామపురంలోని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యురాలు కొడాలి అపర్ణ నివాసంలో జరిగిన కార్యక్రమంలో పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పేట నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, నాయకులు కీసర రాంబాబు, కొడాలి మల్లిఖార్జున, వేద సుబ్రహ్మణ్యం, అన్నెపాగ శ్రీకాంత్, పసుపులేటి శ్రీకృష్ణ, మేడూరి వెంకటేశ్వరరావు, సిమ్మసత్తి శ్రీనివాసరావు, కరుణాకర్, సైదాబాబు తదితరులు పాల్గొన్నారు.



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కచ్చితమైన కొలతలతో సర్వే

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు, చెవిటికల్లు గ్రామాల్లో రైతుల రీ సర్వే చేసిన భూముల్లో ప్రభుత్వం మంజూరు చేసిన సర్వే హద్దురాళ్లను పాతామని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు సోమవారం తెలిపారు. భూములను కచ్చితమైన కొలతలు, హద్దులతో రీ సర్వే చేశామని సర్వే హద్దురాళ్లను కూడా ఎటువంటి ఇబ్బందులు రైతులకు తలెత్తకుండా జాగ్రత్తగా పాతిస్తున్నామని అన్నారు. మండలంలోని పెండ్యాల, కీసర, వేములపల్లి, ఎస్. అమరవరం గ్రామాల్లో భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టామని అన్నారు. సర్వేయర్ నంద్రు అనుష్‌కుమార్, డీటీ షేక్ నాగుల్‌మీరా, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలతో ఆత్మస్థైర్యం

నూజివీడు(ఆగిరిపల్లి): దివ్యాంగులు స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న కృత్రిమ అవయవాల సాయంతో ఆత్మస్థైర్యం పెంపొందించుకుని సాధారణ జీవితం కొనసాగించాలని ప్రముఖ వ్యాపారవేత్త వేగే శ్రీనివాసరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో మచిలీపట్నం స్టార్ కళాశాల అధినేత పెర్నేటి రాంప్రసాద్ ఆర్థిక సాయంతో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన సీతా గణేష్, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన గుండు గంగాదేవి, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం పిన్నమరెడ్డిపల్లికి చెందిన చోడవరపు కోటేశ్వరరావుకు సోమవారం కృత్రిమ కాళ్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, వ్యాపారవేత్త గజ్జల వెంకటేశ్వరరావు, దాతల తరపున విశ్రాంత ఉపాధ్యాయిని లాగిశెట్టి ద్రాక్షాయని, హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.



మిరప రైతులను ఆదుకోవాలి

గంపలగూడెం: మండలంలో మిర్చి సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని కనుమూరు, అనుముల్లంక తదితర గ్రామాల్లో దెబ్బతిన్న మిర్చి పొలాలను శాస్త్రవేత్తలు తక్షణమే పరిశీలించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. మిర్చి వేసిన 20 రోజుల నుంచి మొక్కల్లో పెరుగుదల లేక ఎర్రబడిపోయాయని పైరును రక్షించుకునేందుకు రైతులు వివిధ రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో కొందరు రైతులు మిర్చి తోటలను తీసివేసి మళ్లీ కొత్త మొక్కలు వేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఒక్కొక్క రైతు ఎకరాకు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

అల్లూరు(వీరులపాడు): నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చటం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు వెంకటనారాయణ పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంచికచర్ల : పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించటంతో పాటు పలు క్రీడల్లో మంచి మెరుగైన తర్ఫీదు ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు కేవీవీ శర్మ అన్నారు. మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా ఆటల్లో మంచి ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మొత్తం 9 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనపర్చి పాఠశాలకు పేరు తీసుకువచ్చారని అన్నారు. వారిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పీడీలు బీ శారద, బీఎస్ఎల్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరిటాల జెడ్పీ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శర్మ, పీడీ శారద

లేగదూడలను సంరక్షించుకోవాలి

మంగొల్లు(వత్సవాయి) : పశుపోషకులు లేగదూడల పట్ల జాగ్రత్తలు వహించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంచాలకులు కే విద్యాసాగర్ తెలిపారు. సోమవారం పశుంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం సౌజన్యంతో గ్రామంలోని పశుపోషకులు లేగదూడల ఆరోగ్య పరిరక్షణ, అందాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగదూడల్లో నట్టల నివారణకు అనుగుణంగా మందులను వాడుకోవాలని సూచించారు. పెయ్యదూడల పెంపకం ద్వారా అధిక పాలఉత్పత్తిని సాధించవచ్చన్నారు. లింగ నిర్ధారణ చేసిన పశు వీర్యం వాడడం ద్వారా ఆడదూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. తద్వారా పెయ్యదూడలను అభివృద్ధి పరిస్తే పాలదిగుబడి పెరుగుతుందన్నారు. అందాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెపాక ప్రణీత, ఎంపీటీసీ గోసు రత్నకుమారి, పశువైద్యాధికారి కె. శ్రీనివాస్, కె.భవానీప్రసాద్, శ్రీనునాయక్, పారాసిబ్బంది కె.శ్రీరాములు, జి.వీరయ్య, టీ సురేష్‌కుమార్, నవ్య తదితరులు పాల్గొన్నారు.



పశుపోషకులకు బహుమతి అందిస్తున్న పశుసంవర్ధవశాఖ అధికారులు

స్పందనలో 12 అర్జీల స్వీకరణ

నందిగామ: సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి మొత్తం 12 అర్జీలు అందాయని, వాటిలో ఎనిమిది రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి 7, హౌసింగ్ 2, పంచాయతీరాజ్, సర్వే శాఖ, విద్యాశాఖకు సంబంధించినవి ఒకటి వంతున అందినట్లు ఆర్డీవో ఆర్డీఓ ఎ రవీంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేస్తామన్నారు. ప్రతి అర్జీకి సంబంధించి సమస్య పరిష్కారమయ్యేంతవరకు మానిటరింగ్ జరుగుతుందన్నారు. నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో రవీంద్రరావు

గుణదల మేరీమాత గ్రామోత్సవం

బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): విజయవాడలోని గుణదలలో మేరిమాత వెలసి 100 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని గుణదల మాత విగ్రహాన్ని పలు గ్రామాల్లో ఊరేగిస్తున్నారు. దానిలో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో గుణదల మాత ఊరేగింపు నిర్వహించగా సోమవారం రాత్రి బలుసుపాడు గ్రామంలో గుణదల మాత గ్రామోత్సవం నిర్వహించారు. జగ్గయ్యపేట విచారణ ఫాదర్ జయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సంఘస్తులు, గ్రామ ప్రజలు ఊరేగింపుగా వస్తున్న గుణదల మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద ఫాదర్ జయరాజు సందేశం ఇచ్చారు. సిస్టర్లు అనిత, జూలి, లావణ్య, ఉపదేశి అలోషి, సంఘ పెద్దలు మేరి వినీత, ఉప్పుతోళ్ల బాలస్వామి, పోలంపల్లి దావీదు, సంఘస్తులు, మరియదళ సభ్యులు, పలు గ్రామాల ఉపదేశులు పాల్గొన్నారు.



గుణదల మాత గ్రామోత్సవంలో భక్తులు

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ నక్కా కమల అన్నారు. గ్రామంలో సోమవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వేను వైద్యాధికారి ఇందిరతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30 వరకు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహించి రోగుల వివరాలు సేకరిస్తారన్నారు. అనంతరం మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి రోగులకు పరీక్షలతో పాటు మందులు అందిస్తారన్నారు. ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంచికచర్ల : గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. మండలంలోని కీసర గ్రామానికి చెందిన అంకం కృష్ణంరాజు (38) అదే గ్రామానికి చెందిన ఓ యువతితో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు. వారం రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.